
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
మంగళవారం 6 ఆగస్టు 2024





చినుకు పడితే తిప్పలే

పెద్దేముల్, ఆగస్టు 5: గాజీపూర్ వాగుపై అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన వంతెనపైన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నవర్షం పడితే చాలు వాహనాలు మట్టిలో కూరుకుపోయి అవస్థలు పడుతున్నారు. మండలంలోని గాజీపూర్, బుద్దారం వాగులపైన వంతెనలు నిర్మించేందుకు 2016లో అప్పటి ప్రభుత్వం రూ.8.90కోట్లు మంజూరు చేసింది. కాగా, కాంట్రాక్టర్ రెండు బ్రిడ్జిల పనులు చేపట్టి వాటిని అసంపూర్తిగా వదిలేశారు. గాజీపూర్ వాగుపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా రోడ్డు వేయకుండానే వదిలేశారు. అయితే వాగు వచ్చి జనాలు ఇబ్బందులు పడుతున్నారని వంతెన పైనుంచి రాకపోకలు జరిగేలా దుమ్ములాంటి మట్టిపోశారు. రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి అది బురదగామారి వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. సోమవారం ఒకకారు, ఆటో మట్టిలో కూరుకుపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. అధికారులు స్పందించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కీసరగుట్టలో శ్రావణ పూజలు



రామలింగేశ్వర స్వామికి శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధ మహిమాన్విత క్షేత్రమైన కీసరగుట్టలో సోమవారం శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు జరిగే శ్రావణ మాస మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మూల విరాట్‌కు శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులను అభిషేకాలకు, ఆర్జిత సేవలకు అనుమతించారు. మొదటి రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్న భక్తులు ఆలయ ఆవరణలోని లక్ష్మీ నరసింహ స్వామి, శివపంచాయతనం, శ్రీ సీతారామచంద్రస్వాములను దర్శించుకున్నారు. అలాగే ఆలయం వెలుపల ఉన్న శివలింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నిత్య సేవల్లో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు.

-కీసర, ఆగస్టు 5



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు, భక్తులు



మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్
- ప్రజావాణిలో 108 దరఖాస్తులు

మేడ్చల్, ఆగస్టు(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడానికి అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పంచాయతీలలో నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లా కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలన్నారు. కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానాన్ని త్వరలో అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

వికారాబాద్ ప్రజావాణిలో 141 దరఖాస్తులు

వికారాబాద్, ఆగస్టు 5 : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 141 దరఖాస్తులు, ఫిర్యాదుల వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్ కలెక్టరేట్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వర్షాకాం సగానికి వచ్చినా వానలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వెరసి జిల్లాలోని చెరువులు, కుంటలు నీరు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొద్దిపాటి నీళ్లున్న చెరువుల్లో కూడా చేపపిల్లల పంపిణీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది ఈ సమయానికే చేపపిల్లల పంపిణీ పూర్తయినా ఈ ఏడాది టెండర్ల ప్రక్రియే ప్రారంభం కాలేదు. దీంతో మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

- అదును దాటుతున్నా పట్టని అధికారులు
- నేటికీ పూర్తికాని టెండర్ల ప్రక్రియ
- ఆందోళనలో మత్స్యకార కుటుంబాలు
- జిల్లాలో మొత్తం 1,129 చెరువులు, కుంటలు
- 840 చెరువుల్లో పంపిణీకి ఏర్పాట్లు



ఎండిన కులకచర్ల మండలం రాంనగర్ చెరువు

చేపపిల్లల పంపిణీపై నీలినీడలు!



నీరులేక చెరువులు వెలవెల

పరిగి, ఆగస్టు 5: వానకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో జిల్లాలోని మెజార్టీ చెరువులు నీరులేక వెలవెలబోతున్నాయి. దీంతో చేప పిల్లలను వదులటపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో చేపల వేటనే వృత్తిగా జీవిస్తున్న మత్స్యకారుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు, పాలకులు సైతం పట్టించుకోని పరిసితి. దీంతో తాము నమ్ముకున్న కులవృత్తికి స్వస్తి పలకాల్సిన పరిస్థితి దాపురిస్తున్నదని వాపోతున్నారు. ప్రభుత్వాలు, స్థానిక పెత్తందారులు, నాయకులు తమపై అవలంభిస్తున్న పలు విధానాల మూలంగా ఈ వృత్తిని వీడలేక ఇతర పనులు చేయలేక కొట్టుమిట్టాడుతూ ఆకలితో అలమటించే పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న దోమ మండలం తిమ్మాయిపల్లి చెరువు

తప్పని ఎదురుచూపులు

జిల్లాలోని 20 మండలాల్లో మొత్తం 1,129 చెరువులు, కుంటలున్నాయి. గతేడాది 740 చెరువుల్లో 1.26 కోట్ల చేప పిల్లలను వదిలారు. కాగా ఈ ఏడాది అంతకంటే ఎక్కువ సంఖ్యలో వదిలేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది 840 కుంటలు, చెరువుల్లో మొత్తం 1.29 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ చేపపిల్లల పంపిణీకి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాని పరిస్థితి. గతేడాది జూలై మాసంలోనే చెరువుల్లో చేపపిల్లలను వదిలారు. కానీ, ఈసారి ఆగస్టు వచ్చినా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఎం జరుగుతుందా అని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుతం చేప పిల్లలను వదలాల్సిన సమయం వచ్చింది. అయినా చాలా చెరువుల్లో నీరు లేదు. అక్కడక్కడ కొన్నింటిలో కొంత నీరు చేరినా లాభం లేకుండా ఉంది. చేప పిల్లలు వదిలేంత స్థాయిలో నీరులేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల లీజు వసూలు ఆపాలి

వర్షాలు లేక చెరువుల్లోకి నీరు లేదు. కొన్నిచోట్ల కొద్దిగా నీరు చేరినా ప్రభుత్వం చేపపిల్లలు ఇచ్చే పరిస్థితి లేదు. ఇంకా టెండర్ల ప్రక్రియ కూడా కాలేదు. చెరువులు నిండకున్నా అధికారులు లీజ్ చెల్లించాలని చెబుతున్నారు. దీంతో మత్స్యకారుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. చెరువులు నిండని కారణంగా లీజు వసూలును నిలిపివేయాలి. మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా మత్స్యకారుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు.



-నీరటి నరహరి, మత్స్యకారుల సంఘం పరిగి డివిజన్ కార్యదర్శి

రాయితీపై చేపపిల్లలు పంపిణీ చేస్తాం

జిల్లాలో 840 కుంటలు, చెరువుల్లో 1.29 కోట్ల చేప పిల్లలు వదులటను లక్ష్యంగా పెటుకున్నాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. చేప పిల్లలు వదులటకు ఇంకా నెల సమయం ఉంది. చెరువుల్లోకి నీరు రానిది వాస్తవమే. చేపపిల్లల పంపిణీకి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. టెండర్లు పూర్తి కాగానే అన్ని చెరువులకు పూర్తి రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేస్తాం.

-వెంకన్న, జిల్లా మత్స్యశాఖ అధికారి

సాగుకు లో వోల్టేజీ సమస్యే ఉండదు

- అందుకే నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం
- రైతులకు అన్ని రకాల వసతులు కల్పిస్తాం
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, స్పీకర్ ప్రసాద్
- రూ.10.24కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన



జుంటుపల్లిలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, స్పీకర్ ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే

తాండూరు రూరల్, ఆగస్టు5 : వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకే సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని, అలాగే మరికొన్ని గ్రామాల పరిధిలో అవసరమైన నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేపట్టామని రెవెన్యూ, గృహ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు పేర్కొన్నారు. సోమవారం తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి గ్రామ శివారులో రూ.2.48 కోట్లతో నిర్మాణం చేపట్టిన సబ్ స్టేషన్‌ను స్థానిక శాసనసభ్యుడు బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు గజమాలతో సన్మానించారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

జినుగుర్తి శివారులోనే అన్నింటికీ శంకుస్థాపన..

అదేవిధంగా తాండూరు మండల పరిధిలోని చంద్రవంచ గ్రామ శివారులో నిర్మాణం చేపట్టే సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.2.34కోట్లు, పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామ శివారులో 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.2.43కోట్లు, యాలాల మండలం జుంటుపల్లి గ్రామ శివారులో నిర్మాణం చేసే సబ్ స్టేషన్‌కు రూ.2.99కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లకు జినుగుర్తి గ్రామ శివారులో నూతనంగా ప్రారంభించే సబ్ స్టేషన్‌లోనే శిలాఫలకాలకు శంకుస్థాపన నిర్వహించారు. మొత్తం రూ.10.24కోట్లతో చేపట్టే సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజనీరింగ్ చీఫ్ మోహన్‌నాయక్, ధారాసింగ్, ఎస్.రవీందర్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, బీసీ సెల్ జిల్లా నాయకులు ఉత్తంచంద్, నాయకులు రాందాస్, వడ్డె శ్రీనివాస్, కల్వ సుజాత, విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవ రెడ్డి, డీఈ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరో రూ.33.98కోట్లతో..

తాండూరు పట్టణంలో రూ.33.98 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముర్షాద్ జంక్షన్ వద్ద శంకుస్థాపన చేశారు. రూ.27.50 కోట్లతో అమృత్ 2.0 స్కీమ్ నందు నీటి సరఫరా అభివృద్ధి పథకానికి, రూ. 4.88కోట్లతో చేపట్టే గొల్ల చెరువు సుందరీకరణ, మురుగు నీరు మళ్లింపు పనులకు, రూ.1.60కోట్లతో లక్షలతో ముర్షాద్ దర్గా జంక్షన్ నుంచి కింగ్స్ ప్యాలెస్ వరకు సీసీ రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు.

వికారాబాద్‌లో రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు

వికారాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో రూ.60 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. రూ.12 కోట్ల వ్యయంతో ఆలంపల్లి - రాళ్లచిట్టంపల్లి డబుల్ రోడ్డు, రూ.42 కోట్ల వ్యయంతో మర్పల్లి - కోట్‌పల్లి డబుల్ రోడ్డు నిర్మాణ పనులతో పాటు వివిధ అనుసంధాన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే జిల్లా కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 4 సూట్ల ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రానికి వచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొంగులేటిలకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో స్పీకర్, మంత్రి సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, రోడ్డు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి హరిచందన, ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, ఎస్ఈ వసంత్‌నాయక్, రఘువీరారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు మహమ్మద్ హఫీజ్, కొండల్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, కిషన్‌నాయక్, హన్మంత్ రెడ్డి, రమేష్‌కుమార్, నాయకులు రత్నారెడ్డి, సుభాష్‌యాదవ్, నరోత్తంరెడ్డి, జాఫర్, రెడ్యానాయక్, రామేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొంగులేటి, తదితరులు

30మంది ఎమ్మెల్యేలున్నా అసెంబ్లీకి రాని కేసీఆర్

- ప్రతిపక్ష నేతపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైర్

తాండూరు, ఆగస్టు 5: 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం సరికాదని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి తర్వాత అంతటి బాధ్యత ప్రతిపక్ష నేతపై ఉంటుందన్నారు. కాగా, ఐదు మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క గత అసెంబ్లీలో సమావేశాలకు వచ్చి సమస్యలపై నిలదీశారని గుర్తు చేశారు. త్వరలోనే జహీరాబాద్‌కు ఫోర్‌లైన్ హైవే రోడ్డు మంజూరు కానుందని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ పుట్టిన ప్రాంతమైన తాండూరు, తాను గెలిచిన ప్రాంతం వికారాబాద్‌తో సమానంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం.రమేశ్, మహిళా, వైశ్య ఫెడరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కలెక్టర్ ప్రతీక్, రాష్ట్ర పార్టీ నాయకులు కరుణం పరుషోత్తం రావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తాండూరు ఏఎంసీ ప్రమాణ స్వీకారం

తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. అంతకు ముందు కొత్తగా ఎన్నికైన చైర్మన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గంజ్ మార్కెట్ యార్డు నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు నిర్వహించిన ఎడ్ల బండ్ల ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చైర్మన్‌గా బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా నర్సిరెడ్డి, సభ్యులుగా ఎండి. అజ్మత్ ఆలీ, జె. నర్సప్ప, రాథోడ్ తులసీ రామ్, మహమ్మద్ కరీం, ఉదయ్ భాస్కర్ రెడ్డి, ఈడిగ నర్సింహగౌడ్, మొగులయ్య, బిస్మల్లబీ, శ్రీనివాస్, రాజు, బోజిరెడ్డి, మాణిక్యం, యాలాల పీఏసీఎస్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, వ్యవసాయ శాఖ ఏడీలు ఎస్వీఎస్ ఫంక్షన్ మాల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న తాండూరు ఏఎంసీ పాలకవర్గం

డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి

- శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

బషీరాబాద్, ఆగస్టు 5: డైనమిక్ లీడర్ రేవంత్‌రెడ్డి అని, ఆయన పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బషీరాబాద్ మండల మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. శాసనసభ స్పీకర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో నూతన చైర్మన్ జి.మాధవరెడ్డి, వైస్‌చైర్మన్ మూడవత్ చందర్‌నాయక్, సభ్యులను కార్యదర్శి లక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలతో కలిసి బషీరాబాద్ - జీవన్గి మీదుగా కరన్‌కోట్ వరకు రూ.30 కోట్లతో చేపట్టబోయే డబుల్ లేన్ బీటీరోడ్డు, రూ.3 కోట్లతో బషీరాబాద్‌లో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం భవనానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరిక మేరకు అదనంగా ఇళ్లు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తానని ఇస్తామన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మట్లాడుతూ బషీరాబాద్ మండలంలో ఉన్న మూడు ఎత్తిపోతల పథకాలను మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయించేందుకు స్పీకర్, మంత్రి కృషి చేయాలని కోరారు. బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులుగా సోమవారం ప్రమాణం చేసిన పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తమను పక్కకు పంపించడంపై పెదవి విరిచారు.

బషీరాబాద్ కాంగ్రెస్‌లో అధిపత్య పోరు

బషీరాబాద్, ఆగస్టు 05: బషీరాబాద్ కాంగ్రెస్‌లో అధిపత్య పోరు బహిర్గతమైంది. సోమవారం పంచాయతీలో స్వచ్ఛదనం-పచ్చదనంపై ఎంపీడీవో యాదయ్య ఆధ్వర్యంలో గ్రామ జరిగింది. ఈ సభకు కాంగ్రెస్ శ్రేణులు అజయ్‌ప్రసాద్, ఎస్.వెంకటేశ్ తమ అనుచరులతో కలిసి హాజరయ్యారు. సభలో వీధిలైట్ల విషయమై చర్చకు వచ్చింది. ఈ క్రమంలో సంబంధం లేని ఓ వ్యక్తికి లైట్లు వేసే బాధ్యత ఎందుకు అప్పగించారంటూ వెంకటేశ్ అనుచరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న అజయ్‌ప్రసాద్ అనుచరులు స్పందిస్తూ మీరు వేయించండి అంటూ ఎదురు ప్రశ్నించారు. ఈ విషయమై ఇరువురి నేతల అనుచరుల మధ్య మాటామాటా పెరిగి బాహాబాహికి దిగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. మీడియా ప్రతినిధులను గమనించి అక్కడినుంచి వెళ్లిపోయారు. ఐదారు నెలలుగా ఇద్దరి మధ్య అధిపత్య పోరు కొనసాగుతూ ముదిరి పాకన పడిందని స్థానికులు గుసగుసలాడుకోవడం గమనార్హం.



గొడవకు దిగిన కాంగ్రెస్ నాయకులు



మోమిన్‌పేట్ డిప్యూటీ తహసీల్దార్‌గా సురేశ్‌కుమార్

మోమిన్‌పేట్, ఆగస్టు 5: మోమిన్‌పేట్ డిప్యూటీ తహసీల్దార్‌గా సురేశ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొడంగల్‌లో డిప్యూటీ త హసీల్దార్‌గా పని చేసిన సురేశ్‌కుమార్ బదిలీపై మోమిన్‌పేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులు, ప్రజలు మ ధ్యవర్తులను ఆశ్రయించొద్దని అన్నారు.


వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం


ఆలయ అభివృద్ధి నమూనాను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

కొడంగల్, ఆగస్టు 5: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే పలుమార్లు టీటీడీ, దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించగా తాజాగా సోమవారం మరోసారి పరిశీలన చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానంగా నిత్య పూజలందుకుంటున్న కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి టీటీడీ డీఈ నాగరాజు, ఏఈఈ జయలక్ష్మి, అసిస్టెంట్ ఏఈ రవికాంత్‌తో పాటు ఏఈ తుకారం, శివశంకర్, ఈవో నరేందర్ తదితరులు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, గోపురాలు తదితర వాటిపై నివేదికలు తయారు చేసిన నమూనాను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిపరిచే విధంగా ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాల్లోని వరాహస్వామి, మాడవీధులు, గోశాల తదితర వాటిని పరిశీలించి అభివృద్ధికి కావాల్సిన వివరాలను సేకరించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇరువైపులా, ముందు భాగంలో ఉన్న ఇళ్లను తొలగిస్తూ దాదాపు ఆరు ఎకరాల స్థలంలో తిరుపతి తరహాలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు ఆలయ పరిసరాల్లోని ఇంటి వివరాలను సేకరించి వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో తుది నివేదికతో స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ నిర్మాణ పనులకు పూజలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, మధు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.


























స్పీకర్, మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

వికారాబాద్, ఆగస్టు 5: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. వికారాబాద్‌కు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని జర్నలిస్టుందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని, జిల్లా రిపోర్టర్లకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కోరారు. అంతేకాకుండా హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు పెద్దలు గిరీశ్వర స్వామి, మహమ్మద్ షఫీ, మహేష్, నరేష్, సత్యం, మహేందర్, వెంకట్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీకేలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అహ్మద్‌గూడ ఆర్జీకే కాలనీ వాసులు

కీసర రూరల్, ఆగస్టు 5: రాజీవ్ గృహకల్ప(ఆర్జీకే) కాలనీలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో జీప్లస్ త్రీ మాడల్‌లో 141బ్లాకుల్లో మొత్తం 4512ఇళ్లను నిర్మించి, ప్రభుత్వం లబ్దిదారులకు అందజేసిందన్నారు. కాగా ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ లేకపోవటంతో ఎవరికి తోచినట్లు వారు దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ఇది చాలదన్నట్లుగా జీప్లస్‌త్రీలో నిర్మించిన ఇళ్ల గోడలను తొలగించి మరీ షట్టర్లను ఏర్పాటు చేసుకుంటున్నారని, పై అంతస్తుల్లో నివాసముంటున్న వారు తమ ఇళ్లల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. గోడలు పగులగొట్టడంతో భవన నాణ్యత దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేస్తున్న దుకాణ సముదాయాలను తొలగించటంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతరాజు రాములు, సిరిసిల్ల శంకరయ్య, సందీప్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం బహిష్కరణ

తమ గ్రామాలను యాదాద్రి-భువనగిరిలో కలపొద్దని డిమాండ్


అంకుశాపూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్న విలీన గ్రామాల ప్రజలు, నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 5: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం ప్రజలు బహిష్కరించారు. మండలంలోని అంకుశాపూర్‌లో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. డీపీవో, డీఆర్‌డీవో, డీఎల్‌పీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో కార్యక్రమానికి హాజరై ప్రారంభిస్తుండగా ప్రజలు, నాయకులు తమ గ్రామాలను యాదాద్రీ-భువనగిరి జిల్లాలో విలీనం చేయొద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికారులను చుట్టుముట్టి కార్యక్రమం నిర్వహించకుండా అడ్డుకున్నారు. తమ గ్రామాలను ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో గానీ జీహెచ్ఎంసీలో గానీ విలీనం చేయాలేగానీ, యాదాద్రీ జిల్లాలో ఎలా కలుపుతారని అధికారులను నిలదీశారు. ఆ జిల్లాలో కలిపితే తాము ఉనికిని కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి జిల్లాలో విలీనం చేస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టి జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. డీపీవో వెంకయ్య, డీఆర్‌డీవో సాంబశివరావులు నచ్చజెప్పినా గ్రామస్థులు వినిపించుకోలేదు. మధ్యాహ్నం వరకూ గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించరాదని అధికారులను డిమాండ్ చేశారు. డీఎల్‌పీవో సాంబిరెడ్డి, తహసీల్దారు డీఎస్ రజిని, ఎంపీడీవో గీతారెడ్డి, ఏవో బాసిత్, ఏపీఎం తౌర్యానాయక్, నాయకులు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కరుణాకర్, మశ్చేందర్‌రెడ్డి, మహేష్, మంగారెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్: తమ మూడు గ్రామాలను యాదాద్రీ జిల్లాలో కలపొద్దని సోమవారం అవుషాపూర్, అంకుశాపూర్, మాధారం గ్రామాల జేఏసీ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమను యాదాద్రి జిల్లాలో కలిపితే భవిష్యత్తుకే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు తమ గ్రామాలను అందులో కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని విలీనగ్రామాల జేఏసీ నాయకులు కోరారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పన్నాల కొండల్‌రెడ్డి, వామన్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, ఎల్లాని అయిలయ్య, శోభారాణి, మాదవారెడ్డి, బిక్షపతిగౌడ్, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బద్దం నర్సింహారెడ్డి, వేణు పాల్గొన్నారు.

రూ.44కోట్లతో వికారాబాద్ జిల్లాలో 11 కొత్త సబ్‌స్టేషన్లు

- జిల్లాలో మొత్తం 3లక్షల 32వేల విద్యుత్ కనెక్షన్లు
- 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- రూ.33కోట్ల పెండింగ్ బిల్లులు
- జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి


జినుగుర్తి సబ్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి

తాండూరు రూరల్, ఆగస్టు 5: వికారాబాద్ జిల్లాలో నేరుగా విద్యుత్ సరఫరా చేసి లోవోల్టేజీ సమస్య తీర్చేందుకు కొత్తగా 11 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. వాటిలో మూడు సబ్‌స్టేషన్లు స్థలం లేక పనులు ఆగిపోయాయని, మిగతా ఎనిమిది సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జినుగుర్తిలో సోమవారం 33/11కేవీ ప్రారంభం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మోమిన్‌పేట్ మండల కాసారం వికారాబాద్ న్యూ కలెక్టరేట్, ధారూర్ మండలం గోడంగూడ, కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి, బొంరాస్‌పేట్ మండలం లాగచర్ల, కొడంగల్ మండలం హస్నాబాద్, దోమ మండలం కిష్టాపూర్, కుల్కచర్ల మండలం కుసుమ సముద్రం, వికారాబాద్ మండలం నారాయణపూర్, కొత్తఘడి, మర్పల్లి మండలం పట్లూరు ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.4కోట్ల చొప్పున రూ.44కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో సబ్‌స్టేషన్‌లో 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి 5 నుంచి 6 గ్రామాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.33కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తాండూరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో రూ.16కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. జీరో బిల్లు కొంతమందికి రాలేదని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ప్రజాపాలనకు దరఖాస్తు చేసే సమయంలో రేషన్‌కార్డుతోపాటు రేషన్‌కార్డు ఇవ్వకపోవడం, ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఉండటం వంటి విషయాలను డాటా ఎంట్రీలో నమోదు కాలేక గృహజ్యోతి కొందరికి రాలేదన్నారు. అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. కొంతమంది లైన్‌మెన్‌లు నెలరోజులు దాటినప్పటికీ బిల్లులు ఇవ్వడంలేదని విలేకరులు ప్రశ్నించగా లైన్‌మెన్‌లు అంతా 30రోజుల్లోపు బిల్లులు ఇవ్వాల్సి ఉంటుందని, వారికి ఆదేశాలు జారీచేశామని తెలిపారు. ఈ సమావేశంలో డీఈ భానుప్రసాద్, ఏడీ ఆదినారాయణ, మండల ఏఈ కె.వెంకట్ నాయుడు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించాలి


చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూన్న డాక్టర్ వి.శ్రీకాంత్

మొయినాబాద్, ఆగస్టు 5: వర్షాకాలంలో విష కీటకాలు గ్రామాలతో పాటు కళాశాలలు, పాఠశాలల్లో సంచరిస్తూ మనుషుల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు విద్యార్థులు ఆరోగ్య సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించాలని నగరంలోని టీఎక్స్ హాస్పిటల్స్ సీఓఓ డాక్టర్ వి.శ్రీకాంత్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం ఫార్మసీ, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో 'హెల్త్‌కేర్ డెలివరీ సిస్టమ్ ఇన్ ఇండియా' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ వి.శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆరోగ్యసంరక్షణ విభాగంలో అవకాశాలపై వివరించారు. విష కీటకాలను అరికట్టేందుకు అవసరమైన ఆధునిక విధానాలను కనుగొనేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఆరోగ్య సంరక్షణ విభాగంలో వచ్చే అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, శంకర్‌లింగం, పవన్‌కుమార్, రాజు, ఫార్మసీ హెచ్‌ఓడీ కుమారస్వామి అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సుధాకర్

నేడు ఆమనగల్లులో గద్దర్ వర్ధంతి

ఆమనగల్లు, ఆగస్టు 5: ప్రజా గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ పూలే జ్ఞాన జాతర రాష్ట్ర కో-ఆర్డినేటర్ జీ.సుధాకర్ తెలిపారు. ఆమనగల్లులో సోమవారం గద్దర్ వర్ధంతి సభ కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నేటి ఉదయం 11గంటలకు ఆమనగల్లులోని రాజీవ్ చౌక్‌వద్ద నిర్వహించే వర్ధంతి సభకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మహనీయుల గళం మాస్టర్ జీ, దళిత ప్రజాసంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. గద్దర్ జీవిత చరిత్రను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమానికి కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు, పూలే, అంబేడ్కర్ వారసులు, దళిత, ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలోబిక్షపతి, రఘురాములు, రామన్‌గౌడ్, యాదయ్య, రాములు, అంజయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

శంషాబాద్, ఆగస్టు 5: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు శంషాబాద్‌లో మహార్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్‌మెంట్స్ వెంటనే చెల్లించాలన్నారు. విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు పృథ్వీతేజ మాట్లాడుతూ.. ఏడువేల కోట్ల స్కాలర్‌షిప్‌లను చెల్లించాలన్నారు. ప్రతీ విద్యార్థులకు రూ.3వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఫీజు దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమానికి ముందు బస్టాండ్, మహావీర్ బిల్డర్స్, మధురానగర్‌ల గుండా మహార్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్, మణికంఠ, ప్రదీప్, చరణ్, భరత్, శివ, పవన్, తిరుపతి, అఖిల్, మనీష, ప్రీతి, అనూష, భార్గవ్, మేఘన పాల్గొన్నారు.

పిల్లలకు మెదడువాపు నివారణ వ్యాక్సిన్ వేయించాలి


చేవెళ్లలో పిల్లలకు వ్యాక్సిన్ వేయిస్తున్న అధికారులు

చేవెళ్ల, ఆగస్టు 5: మెదడువాపు నివారణ టీకాలు పిల్లలకు వేయించాలని చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిని విజయలక్ష్మి తెలిపారు. సోమవారం చేవెళ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు మెదడువాపు నివారణ జేఈ వ్యాక్సిన్ వేయించారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలందరికీ జేఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, మాజీ సర్పంచ్ శైలజ, పీఎస్ రాఘవేందర్, అంగన్‌వాడీ టీచర్లు ప్రవీణ, ఉమారాణి, ఆశా, ఐకేపీ వర్కర్లు పాల్గొన్నారు.

రద్దీకనుగుణంగా బస్సులు నడపాలి


బస్సుకోసం రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

మంచాల, ఆగస్టు 5: ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.యాదయ్య ఆర్టీసీ అధికారులను కోరారు. సోమవారం చెన్నారెడ్డిగూడ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి రాస్తారోకోలో పాల్గొన్నారు. యాదయ్య మాట్లాడుతూ చెన్నారెడ్డిగూడకు ఉదయం బస్సు ట్రిప్పు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం 7గంటలకు అజినాతండా నుంచి వచ్చే బస్సు బండలేమూర్‌లోనే ప్రయాణికులతో కిక్కిరిసిపోతోందని, బస్సులో స్థలం సరిపోక చెన్నారెడ్డిగూడ విద్యార్థులు ఎక్కలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆ తర్వాత ఇంకో బస్సు కోసం ఉదయం 10గంటలదాకా వేచి ఉండాల్సిందే అన్నారు. అప్పటికే స్కూళ్లు, కాలేజీల సమయం అయిపోతుందన్నారు. సమస్యపై స్పందించి ఉదయంపూట అదనపు బస్సును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనలో సీపీఎం మండల నాయకుడు పి.వెంకటేష్, చంద్రయ్య, బి.పాండు, సురేష్, పాండు, మోతీలాల్, కృష్ణ, జంగయ్య, ప్రవీణ్, హన్మంతు, కిషన్, విక్రమ్, క్రాంతి, సత్యనారాయణ; వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగిలిగిద్ద కాలేజీలో వసతులు కల్పిస్తాం


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్, గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు5: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కల్పించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ప్రిన్సిపాల్ మంజుల, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్యాంసుందర్, గ్రామస్తులు సోమవారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. స్వీపర్, అటెండర్ లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో స్వీపర్, అటెండర్లను నియమిస్తానని తెలిపారు. కాలేజీకి కంప్యూటర్‌ను ఇప్పిస్తానని తెలిపారు. మూలన పడ్డ మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

'వేద పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా'

వేద పాఠశాల అభివృద్ధికి తన వంతుగా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా కిషన్‌నగర్ శివారులోని జగద్గురు వేద పాఠశాలలో గల కాశీ విశ్వేశ్వరస్వామికి ఎమ్మెల్యే దంపతులు రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో వేద పాఠశాల నెలకొల్పడం సంతోషకర విషయం అన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాశీనాథ్, బసవేశ్వర్, సంఘయ్యస్వామి, వీరేశం, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్: నాగిరెడ్డిగూడ గ్రామస్తులతో డీసీపీ శ్రీనివాస్


సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న షీ టీమ్ ఇన్‌చార్జి ఎల్లమ్మ

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మొయినాబాద్, ఆగస్టు 5: యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలనీ రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నాగిరెడ్డిగూడలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ యువత డ్రక్స్, గంజాయి వంటివి జీవితాలను నాశనం చేస్తాయన్నారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుతాయన్నారు. గ్రామాల్లో ఎలాంటి నేరాలు, దొంగతనాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలందరూ సమకరించాలని అన్నారు. కర్యాక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ నర్సింహరాజు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ అర్జున్, మనోజ్‌కుమార్, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లను తెలుసుకొని మసలుకోవాలి

ఆదిభట్ల: విద్యార్థినులు గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్‌లపై తెలుసుకొని జాగ్రత్తపడాలని, సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులకు చెప్పాలని షీ టీమ్ ఇబ్రహీంపట్నం డివిజన్ ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ ఎల్లమ్మ సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కొంగరకలాన్ శ్రీనివాస హైస్కూల్లో 'సైబర్ క్రైమ్, డ్రగ్స్‌తో అనర్థాలు, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్' అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్న విధానాలపై వివరించారు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరి సాయంత్రం ఇంటికి చేరే వరకు జరిగిన ప్రతీ విషయాన్ని తల్లిదండ్రులతో పంచుకోవాలని అన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే 1098కు లేదా 8712662111కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ లక్కరాజు శ్రీనివాసరావు, డైరెక్టర్ రాధిక, షీటీమ్‌సిబ్బంది శ్రీకాంత్, కుమార్ పాల్గొన్నారు.

రెండేళ్లలో అన్ని తండాలకూ బీటీ రోడ్లు


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యువకులు

ఆమనగల్లు, ఆగస్టు 5 : రెండేళ్లలో అన్ని గిరిజన తండాలు, గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించి రవాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమత్తు, ఆధునికీరణపై సోమవారం ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన నివాసంలో పలువురు అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు మండలం శంకర్ గ్రామ పంచాయతీ పరిధి దయ్యాలబోడు తండాకు బీటీ రోడ్డు నిర్మించాలని తండా యువకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కత్వ వాగు నుంచి తండాకు రోడ్డు లేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. త్వరలోనే బీటీ రోడ్డు వేస్తామని కసిరెడ్డి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.180కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. విద్యతోనే సమాజంలో మార్పు, అభివృద్ధి సాధ్యమన్నారు. గిరిజనులు తమ పిల్లలను పాఠశాలలకు పంపి చక్కటి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, విజయ్, శ్రీను, నవీన్, రమేశ్, రాజేశ్, వినోద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్: పోచారం పరిధి నారపల్లిలో మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ జిల్లా ప్రత్యేకాధికారి జాన్ శాంసన్


మేడ్చల్: జెండా ఊపి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మర్రి దీపిక


పరిగి: సుల్తాన్‌పూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్


వికారాబాద్: పట్టణంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కొడంగల్: స్వచ్ఛదనం, పచ్చదనంలో పాల్గొన్న రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

‘స్వచ్ఛదనం-పచ్చదనం’లో భాగస్వాములవ్వాలి

స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రతీఒక్కరు భాగస్వాములవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో జిల్లాలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 9వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.


శామీర్‌పేట: తూంకుంటలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమ ర్యాలీలో డోలు కొడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


కీసర రూరల్: శిల్పానగర్‌లోని ఎస్టీ బాలికల హాస్టల్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ కొకుంట్ల చంద్రారెడ్డి


దోమ: అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు


కీసర: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పూర్ణిమ



తాండూరు:పరిసరాల పరిశుభ్రతపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గాంధీ నగర్ పాఠశాల విద్యార్థులు


మోమిన్‌పేట్: ఎన్కెపల్లిలో పర్యటించిన మండల ప్రత్యేకాధికారి పూర్ణచందర్‌రావు



మూడుచింతలపల్లి: లక్ష్మాపూర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన ర్యాలీ


బొంరాస్‌పేట్: నాందర్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


ఘట్‌కేసర్: బస్టాండ్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ ముల్లి పావని, కౌన్సిలర్లు


కులకచర్ల: బండవెల్కిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


పూడూరు: తిర్మలాపూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, గ్రామస్థులు



కొడంగల్ రూరల్: సంగాయిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్


శామీర్‌పేట: గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



పరిగి: స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీలో పరిగి మునిసిపల్ చైర్మన్ అశోక్, కమిషనర్ వెంకటయ్య

ఆలయాల్లో భక్తుల సందడి

వికారాబాద్, ఆగస్టు 5: శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా వికారాబాద్ బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి శివుడిని దర్శించుకున్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ పూజల్లో పాల్గొన్నారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు అన్నదానం చేస్తున్నట్లు వీర శైవ సమాజం అధ్యక్షుడు అప్ప విజయ్‌కుమార్, కార్యక్రమం బాధ్యులు ఆత్మలింగం, వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్ పర్సన్ మంజుల రమేష్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: శ్రావణమాసం సందర్భంగా సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాళ్లగూడుపల్లి సమీపంలోని నందివాగు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో వెలిసిన శ్రీ రామలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో భక్తులు అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని ఎన్కతల గ్రామంలో వెలిసిన శ్రీ శనీశ్వర స్వామి ఆలయం, వెల్చాల్ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి, బిక్కరెడ్డి బావుల్లో వెలిసిన శ్రీ అనంత లక్ష్మీనర్సింహస్వామి, దేవరంపల్లిలో శ్రీ భ్రమరాంశ మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వికారాబాద్: బుగ్గ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


పరిగి: శివాలయం వద్ద భక్తుల పూజలు

పరిగి: శ్రావణమాసం తొలి సోమవారం దేవాలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి. పరిగిలోని శివాలయం, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శామీర్‌పేట: స్థానిక శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి (శివాలయం)లో ఆలయ ప్రధానార్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రావణ మాసం తొలి సామవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ప్రధానర్చకులు అర్చన, మంత్ర పుష్పం, హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా అలియాబాద్ చౌరస్తాలోని రత్నాలయ శ్రీవేంకటేశ్వర్‌స్వామి ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ధ్వజారోహణం

ఘట్‌కేసర్ రూరల్: మండలంలోని ఎదులాబాద్ శ్రీ గోదా సమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యవిధి, భేరిపూజ దేవతాహ్వానము కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలోని ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు, పూలు సమర్పించి ధ్వజారోహణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



యువతి అదృశ్యం


ఉమారాణి

ఘట్‌కేసర్ రూరల్, ఆగష్టు 5: ఓ యువతి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన మంతపూర్ నర్సింహా కూతురు ఎం.ఉమారాణి(19సంవత్సరాలు) స్థానిక కృష్ణ క్లాత్ స్టోర్‌లో పనిచేస్తోంది. ఈ నెల 3న రాత్రి భోజనం చేసి నిద్రించాక ఉదయంలేచి చూసేసరికి ఉమారాణి కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు తెలిసిన వారిని, బంధువుల ను, మిత్రులను విచారించిన ఫలితం లేకపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కీసర, ఆగస్టు 5: ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన కీసర పరిధి యాద్గార్‌పల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ నగర్‌కు చెందిన రాజు (38) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా కంపెనీలో పని భారం, ఒత్తిడి పెరిగి మానసిక క్షోభ అనుభవించాడు. దీంతో సోమవారం యాద్గార్‌పల్లి ప్రధాన రహదారి వద్దకు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పటించుకున్నాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పి, 108కు కాల్ చేసి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని రాజును గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఆర్టీసీ అధికారి

ఘట్‌కేసర్ రూరల్, ఆగష్టు 5: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ ఆర్టీసీ అధికారి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ అరుందతి కాలనీకి చెందిన ధరావత్ వెంకట్‌రావు టీఎస్‌ఆర్టీసీలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతనెల 31న ఇండస్ ఇండ్ క్రెడిట్ కార్డు డిపార్టుమెంట్ నుంచి మాట్లాడుతున్నానని, మీ క్రెడిట్‌కార్డుకు బీమా కార్డు యాక్టివేట్ అయిందని ఫోన్ చేశారు. అయితే తాను ఎలాంటి క్రెడిట్ కార్డుకు బీమా చేయలేదని వెంకట్‌రావు చెప్పాడు. వెంటనే బీమా కార్డు డీయాక్టివేట్ చేయాలని చెప్పడంతో సైబర్ నేరగాళ్లు అతడికి వాట్సాప్‌లో ఓ లింక్ పంపించి అందులో వివరాలు నమోదు చేసి పంపించాలని తెలిపాడు. దీంతో వెంకట్‌రావు వివరాలు నమోదు చేసి ఓటీపీ నెంబర్ చెప్పడంతో బ్యాంక్ ఖాతాలోని రూ.1,47,395 వెళ్లిపోయాయి. బ్యాంక్‌ఖాతాలో డబ్బులు పోయినట్లు మెసేజ్ రావడంతో మోసపోయాయని గమనించి పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా నాగమణి

కీసర రూరల్, ఆగస్టు 5: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా ఎ.నాగమణి నియామక మయ్యారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజమల్లయ్య గత నెల 22న ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగమణిని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, వైస్‌ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


తాండూరు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పక్కనే మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్


తాండూరులో ఎడ్ల బండిపై ఊరేగింపులో ఎమ్మెల్యే, మంత్రులు

తాండూరు, ఆగస్టు 5: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం తాండూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ సంక్షేమం ప్రతినిధులు సన్మానించి కేక్‌కట్ చేయించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీశ్రేణులు, నాయకులు కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అభిమానులు, పార్టీ శ్రేణుల మధ్యన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేక్‌కట్ చేశారు. కౌన్సిలర్ ఫాల్మాఫాతిమా జుబేర్‌లాల ఆధ్వర్యంలో ముర్షద్ దర్గా వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శాలువాతో సన్మానించి కేక్‌కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు. వేడుకలలో ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ పాల్గొన్నారు. ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భోజనం చేసి పుస్తకాలను పంపిణీ చేశారు.


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్‌లో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల సమక్షంలో కోట్‌పల్లి మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆయనను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం, లొంక నర్సింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, యాలటి శ్రీనివాస్, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని మన్నెగూడ చౌరస్తాలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగాధర్ గౌడ్, భాస్కర్‌గౌడ్‌లు సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తాండూరు-వికారాబాద్ రోడ్డు పనులకు శంకుస్థాపన

పెద్దేముల్: తాండూరు-వికారాబాద్ రోడ్డు వెడల్పు పనులకు సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, ఎమ్మెల్యే బుయ్యని మనోహరరెడ్డిలు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నుంచి రూ 48.80 కోట్లు మంజూరు కావడంతో పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్:** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో మున్సిపల్ కౌన్సిలర్ నర్రి ధనలక్ష్మి కాశయ్య ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బీరప్ప స్వామి బోనాల పండుగ అత్యంత వైభవంగా నిర్వహించారు.

● **మోమిన్‌పేట్:** రామ్‌నాథ్‌గూడుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు సోమవారం చిన్నారులకు అన్నప్రాసన చేయించారు.

● **నవాబుపేట:** తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా పని చేస్తున్న లింగంపల్లి గ్రామానికి చెందిన తలారి శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన మిత్రులు బాధిత కుటుంబానికి సోమవారం రూ.4లక్షల 62వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● **ధారూరు:** ఎబ్బనూర్‌కు చెందిన బేగరి రాజయ్యకు చెందిన ఎద్దు జూలై 23న పిడుగు పడి మృత్యువాతపడింది. మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బాధితుడికి రూ.15వేలు అందజేశారు.

● **బొంరాస్‌పేట్:** పోలెపల్లి లో ఆశ్రయ ఫౌండేషన్ సంస్థ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యోగా మ్యాట్స్ బ్యాగులు, చెప్పులను సోమవారం పంపిణీ చేశారు.

● **పరిగి:** పరిగి పట్టణం, గ్రామాల్లోని పలు పాఠశాలల్లో సోమవారం పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి డి.అమర్‌నాథ్ పర్యటించి పీఆర్టీయూ సభ్యత్వ నమోదును చేయించారు.

● **తాండూరు రూరల్:** జినుగుర్తి శివారులో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన శాసన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్ అలీ కలిసి సన్మానించారు.

● **మేడ్చల్ టౌన్:** కండ్లకోయంలో రూ.30లక్షలతో బీటీ రోడ్డు పనులను కౌన్సిలర్ హంస రాణి కృష్ణ గౌడ్ సోమవారం పరిశీలించారు.

● **బంట్వారం:** మూడు నెలల కిందట విద్యుత్ ప్రమాదానికి గురైన స్టాట్ బిల్డింగ్ నవీన్ కుమార్‌కు హెచ్ 2 యూనియన్ రూ.60వేలు ఆర్థిక సాయం అందించింది.

● **మూడుచింతలపల్లి:** లక్ష్మాపూర్‌లో మాజీ సర్పంచ్ క్యాతం కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు క్యాతం మధుకృష్ణ లక్ష్మాపూర్ గ్రామంలోని డ్వాక్రా భవనంలో మహిళలకు తన సొంతంగా 30 కుట్టుమిషిన్‌లను పంపిణీ చేశారు.

● **మర్పల్లి:** తహసీల్దార్ గణేశ్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సోమవారం మునిరోద్దీన్ మర్పల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

● **మర్పల్లి:** జాతీయ ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీని మంగళవారం(నేడు) మర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజమల్లయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **కొడంగల్:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దని మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య ఆధ్వర్యంలో సోమవారం కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

వికారాబాద్, ఆగస్టు 5: తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని మునిసిపల్ ఛైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో యుజీడీ సమస్యతో తాగునీరు కలుషితం అవుతుందని వార్డు కౌన్సిలర్ బొండల సువర్ణ మునిసిపల్ ఛైర్ పర్సన్ దృష్టికి తీసుకురావడంతో కాలనీ పర్యటించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వికారాబాద్ మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

గ్రామాన్ని మునిసిపాలిటీలో విలీనం చేయొద్దు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 5 : తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయరాదని కోరుతూ మండలంలోని పూడూరు గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. పలువురు గ్రామస్తులు సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిశారు.

మొక్కలతోనే భావితరాల మనుగడ

పూడూరు, ఆగస్టు 5: మొక్కలతోనే భావితరాల మనుగడ సాధ్యమని హైదరాబాద్ గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు అన్నారు. మండలంలోని సోమన్‌గుర్తిలో సోమవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి నీలగిరి, చింత, నేరేడు వంటి 800 మొక్కలను గ్రామ శివారులోని ఖాళీస్థలం, పల్లె ప్రకృతివనంలో నాటారు. సుమారు 35 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొని నాటారు. కంపెనీ సీనియర్ సీఎస్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేష్, ఉద్యోగులు వెంకటేష్, గోపి, సత్య, రాజు, కార్తీక్, తిరుపతి, రాజశేఖర్, విక్రం, సంజయ్, దేవేంద్ర, జ్యోతి, సిల్కి, సోమన్‌గుర్తి మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కేరవెళ్లి సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

నూతన సబ్‌రిజిస్ట్రార్‌కు సన్మానం

ఘట్‌కేసర్, ఆగస్టు 5: ఘట్‌కేసర్ నూతన సబ్‌రిజిస్ట్రార్ హన్మంతరావును రియాల్టర్స్ అసోసియేషన్ నిర్వాహకులు సోమవారం ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రియాల్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.మహేష్, రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వి.గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి నందు, ప్రతాపరెడ్డి, రఘు పాల్గొన్నారు.